ఈ రోజు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో జరిగిన భగత్‌సింగ్ వర్ధంతి సభ నోట్‌ను ప్రచురణార్ధం పంపుతున్నాము – జె.జయరాం, ఆఫీసు కార్యదర్శి

తేది : 23 మార్చి, 2023.

## సోషలిజమే దేశానికి భవిష్యత్తు
## ప్రజల కోసం జీవితం అంకితం
## సిపిఐ(ఎం) కార్యకర్తల ప్రతిజ్ఞ
## 'అదానీ.. క్విట్ ఆంధ్రప్రదేశ్' నినదించాలని యువతకు పిలుపు
## భగత్‌సింగ్ వర్ధంతి సభలో వి.శ్రీనివాసరావు, ఎస్.పుణ్యవతి

స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి సభ సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటి సభ్యులు ఎస్.పుణ్యవతి అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి హాజరైన వారంతా కార్పొరేట్, మతోన్మాద నిరంకుశ కోరలనుండి భారతదేశాన్ని విముక్తి చేయడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

23 సంవత్సరాల వయసులోనే సోషలిజమే భారతదేశానికి అంతిమ లక్ష్యం అని నమ్మి స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన విప్లవ యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. వారిని నిర్దాక్షిణ్యంగా ఉరి తీసినా స్వాతంత్ర్య పోరాటాన్ని బ్రిటిష్ వలసవాద ప్రభుత్వం ఆపలేకపోయిందన్నారు. భగత్‌సింగ్ మరణించిన తరువాత 16 సంవత్సరాలపాటు దేశం నలుమూలలా పోరాటాలు వెల్లువెత్తాయని తెలిపారు. వీర తెలంగాణ పోరాటం, చల్లపల్లి జమీందారీ, కూలి పోరాటాలు, రైతాంగ పోరాటాలు, సైనికుల పోరాటాలతో సహా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసి దేశాన్ని వదిలి వెళ్లకతప్పని పరిస్థితికి తీసుకెళ్ళాయని, ప్రజా పోరాటాలకు ఎదురు లేదని నిరూపించాయని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక బ్రిటిష్ పాలన లాగే మోదాని పాలనను తీసుకొచ్చిందని, దేశ ప్రజల సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. మైన్స్, భూమి, నీరు, అడవులు, పోర్టులు అన్నింటినీ మోడీ ప్రభుత్వం అదానీకి కట్టబెట్టడంవల్లే రెండేళ్ళ కాలంలోనే ప్రపంచ రెండవ ధనవంతుడుగా ఎదిగాడన్నారు. హిండెన్‌బర్గ్ నివేదికతో మోసం బయటపడినా ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిస్సిగ్గుగా అదానీకోసమే పని చేస్తున్నాయని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టి కేంద్రం చెప్పినట్టల్లా ఆడుతోందని, గంగవరం పోర్టును అడ్డదారుల్లో అదానీకి కట్టబెట్టారని, అందుకోసం ఐఓసిపై కూడా ఒత్తిడి తెచ్చి ఒప్పందాలు చేసుకునేలా చేశారంటే ఎంత దిగజారిపోయారో అర్ధమవుతోందని ఎద్దేవా చేశారు. సాగు భూములకు ఇవ్వాల్సిన నీటిని హైడ్రో ప్రాజెక్టుల కోసం అదానీకి, షిర్డిసాయి కంపెనీకి కేటాయించడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన భగత్‌సింగ్‌ను స్మరించుకుంటూ నేడు రాష్ట్ర ప్రయోజనాల కోసం "అదానీ... క్విట్ ఆంధ్రప్రదేశ్" నినాదాన్ని తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ మరణించే కొద్ది సమయం ముందు కూడా భగత్‌సింగ్ లెనిన్ వ్రాసిన రాజ్యం – విప్లవం పుస్తకాన్ని అధ్యయనం చేశారని, ఆ సమయంలో కూడా దేశ ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే ఏం చేయాలన్న ఆలోచన తప్ప తన ప్రాణం గురించి ఆలోచించలేదన్నారు. స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్‌తోపాటు రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లా ఖాన్ వంటి ఎంతోమంది అమర వీరులు మతాలకతీతంగా పోరాటాలు చేశారన్నారు. స్త్రీలంటే తమ వెంట నడిచేవారు, గడప దాటనీయకూడదన్న హీన భావాన్ని అధికారంలో ఉన్న ఆర్‌యస్‌యస్ భావజాలం నడిపిస్తున్నది. స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొంటూ భగత్‌సింగ్‌ను పోలీసుల కళ్ళుగప్పి తప్పించిన దుర్గా భాబీ, మాస్టర్ సూర్యసేన్ నాయకత్వంలో పోరాడి ప్రాణాలు కోల్పోయిన ప్రీతి లతా వడేదార్ వంటి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడారన్నారు. మన రాష్ట్రంలో అల్లూరి, కొమరం భీమ్ వంటి వీరులు గిరిజనులలో చైతన్యం తెచ్చి పోరాటం చేశారన్నారు. కానీ మోడీ సర్కారు గిరిజనులను భూముల నుండి గెంటివేస్తున్నదని, వారి హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్లకు భూములు కట్టబెట్టడానికి గిరిజనుల రక్షణ కోసం ఉన్న చట్టాలను నాశనం చేస్తున్నారన్నారు. భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశామని, ప్రతి ఒక్కరూ తమ బిడ్డలను వ్యక్తిగత స్వార్ధం కోసం కాకుండా దేశంకోసం, ప్రజల కోసం ఆలోచించేలా తీర్చిదిద్దాలని అన్నారు.

ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాం అధ్యక్షత వహించారు.